సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 28 । జూన్ । 2023



గురుకులంలో ఏం జరిగింది?

అబ్దుల్లాపూర్‌మెట్‌లోని గురుకుల పాఠశాల లో జైకేసారానికి చెందిన విద్యార్థి ఆత్మహత్య అంతుచిక్కని మిస్టరీగా మారింది.

- 8లో



నిధులున్నా.. పనులు సున్నా

ఖప్రాయపల్లి నుంచి మోత్కూరు ప్రధాన రహదారి మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోంది.

- 9లో

గరిష్టం/కనిష్టం
32°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో వసతులు కల్పిస్తాం



డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఆలేరురూరల్: ఆలేరు పట్టణ కేంద్రంలోని పేదలకు కట్టించిన 64 డబుల్ బెడ్రూమ్ ఇళ్లల్లో మౌలిక వసతులు, మిషన్ భగీరథ నీరు, విద్యుత్ కనెక్షన్, అసంపూర్తి డ్రెయినేజీ తదితర సమస్యలపై ఆదివారం సాక్షి దినపత్రికలో 'ఉండలేక.. వదల్లేక' అనే శీర్షికన కథనం ప్రచురించింది. కథనానికి మిషన్ భగీరథ డీఈ కర్నాకర్, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, విద్యుత్ అధికారి ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ కమిషన్ చక్రపాణి స్పందించి, మంగళవారం కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. మురుగు నీరును బయటికి పంపడానికి ప్లానింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట పురపాలక సంఘం వైస్ చైర్మన్ మాధవి, బాలస్వామి, వెంకటేష్, సంపత్, సంతోష్ ఉన్నారు.

బొల్లెపల్లి వాసికి ఉత్తమ పురోహిత అవార్డు



అవార్డు అందుకుంటున్న మణికంఠశర్మ

భువనగిరిటౌన్: భువనగిరి మండలం బొల్లెపల్లికి చెందిన నారాయణ మణికంఠశర్మ ఉత్తమ పురోహిత అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో గల హరిహర కళాభవన్‌లో ఉజ్వల కురుగంటి కళాక్షేత్రం సకల కళావైభవం స్ఫూర్తి వారు సోమవారం అవార్డు అందజేశారు.

దళితబంధులో మాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి

వలిగొండ: ప్రభుత్వం రెండో విడత అమలు చేయనున్న దళితబంధులో మాల కులస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర చీఫ్ సలహాదారు రావుల అంజయ్య, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ తలమల్ల రవి కోరారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలో మాల మహానాడు నాయకుడు మామిండ్ల రత్నయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో చెరుకు రామచందర్, వెంకటస్వామి, దొంత సత్యం, వసంగి రాములు, రాజు, రాపోలు పవన్ కుమార్, కూచిమల్ల చందు, మద్దెల అర్జున్, కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు జరిగాయి. సుప్రభాతం, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు.

పల్లెల్లో 'పాల' పోరు

గ్రామాల్లో ఉత్కంఠ రేపుతున్న పాల సంఘం ఎన్నికలు

- ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్
- తమ వారిని చైర్మన్లుగా గెలిపించుకోవడానికి కుస్తీ

సాక్షి, యాదాద్రి: జిల్లాలో పాల సంఘాలకు జరుగుతున్న ఎన్నికలు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. రానున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇప్పటికే రాజకీయ వాతావరణం మెల్లమెల్లగా వేడెక్కుతోంది. దీంతోపాటు ఈ ఏడాది పదవీ కాలం ముగియనున్న ముగ్గురి మదర్ డెయిరీ డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు సెప్టెంబర్‌లో జరగనున్నాయి. ఈ క్రమంలో పాల సంఘం ఎన్నికలను బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. తమ వారిని చైర్మన్లుగా గెలిపించుకోవడానికి కుస్తీ పడుతున్నాయి. జిల్లాలో 280 వరకు పాలసంఘాలు ఉన్నాయి. అయితే చైర్మన్లుగా పోటీలో ఉన్నవారికి ఈసారి చాలాచోట్ల వ్యతిరేకత ఎదురవుతోంది.

ఈనెల 30న ముగియనున్న పాల సొసైటీ ఎన్నికలు

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో వేలాది మంది రైతులతో ముడిపడి ఉన్న నార్మల్ ఎన్నికలు ఈసారి రసవత్తరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్మల్) పాల సొసైటీల ఎన్నికలు జూన్ 30న ముగుస్తాయి. గ్రామాల్లో పాల ఉత్పత్తిదారులు స్థానిక సొసైటీ కోసం 10 మందిని ఎన్నుకుంటారు. వారిలో నుంచి ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. మదర్ డెయిరీ పరిధిలోని చైర్మన్లలో ఇద్దరిని డైరెక్టర్లుగా ఎన్నుకుంటారు. అయితే వచ్చే సెప్టెంబర్ చివరి నాటికి ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లు అర్కాల గాల్‌రెడ్డి, దొంతిరిసోమిరెడ్డిల పదవీకాలం ముగుస్తుంది. వీరికి మరోసారి డైరెక్టర్లుగా అవకాశం దక్కుతుందా అని గ్రామాల్లో పాడి రైతులు చర్చించుకుంటున్నారు. కాగా.. మదర్ డెయిరీలోని మెజార్టీ సొసైటీలు యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఉన్నాయి.



పాల సొసైటీ ఎన్నిక నిర్వహించాలని వినతిపత్రం అందిస్తున్న బస్వాపురం పాల సొసైటీ డైరెక్టర్లు, రైతులు

ఖాళీ కానున్న మూడు డైరెక్టర్ల స్థానాలు

15 మంది డైరెక్టర్లు ఉన్న మదర్ డెయిరీలో ముగ్గురి డైరెక్టర్ల పదవీకాలం సెప్టెంబర్‌లో ముగియనుంది. ఇందులో జిల్లాకు చెందిన ఇద్దరు డైరెక్టర్లు ఆలేరు మండలం కొలనుపాక మధిర బైరాంనగర్ చైర్మన్ దొంతిరి సోమిరెడ్డి, రాజాపేట మండలం చల్లూరు అన్నదాత పాలసంఘం చైర్మన్ అర్కాల గాల్‌రెడ్డి ఉన్నారు. దీంతో జిల్లాలోని మదర్ డెయిరీ పరిధిలో ఎన్నికల హడావుడి కొనసాగుతోంది.

పలు చోట్ల వివాదాలు తలెత్తడంతో..

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 280 మంది పాలసొసైటీ చైర్మన్ల ఎంపిక జూన్ 30 నాటికి పూర్తికావాలి. ఇందుకోసం ఎన్నికల అధికారులను నియమించి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కానీ పలు చోట్ల వివాదాలు తలెత్తడంతో చైర్మన్ల పేర్లు ప్రకటించడం లేదు. కొన్ని సొసైటీల్లో వివాదాలు కొనసాగుతుండగా పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

ఎన్నిక నిర్వహించాలని వినతి

భువనగిరి మండలం బస్వాపురం పాల సంఘం ఎన్నిక నిర్వహించాలని ఆరుగురు డైరెక్టర్లు జిల్లా సహకార అధికారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. 10 మంది డైరెక్టర్లలో ఆరుగురు డైరెక్టర్లు చైర్మన్ అభ్యర్థికి వ్యతిరేకంగా ఉన్నారు. అయితే ప్రస్తుతం మదర్ డెయిరీలో డైరెక్టర్‌గా ఉన్న కస్తూరి పాండు స్థానికంగా చైర్మన్‌గా ఎన్నికైతేనే డైరెక్టర్‌గా కొనసాగుతారు. దీంతో అతనికి ఈ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకం కానుంది. కానీ పాల సొసైటీ చైర్మన్ ఎన్నికకు కావాల్సిన మెజార్టీ ప్రస్తుతానికి లేదు. దీంతో ఎన్నికను వాయిదా వేశారు. ఆలేరు మండలం గుండ్లగూడెంలో సర్పంచ్, పాల సొసైటీ చైర్మన్లు ఇద్దరు అధికార బీఆర్ఎస్‌కు చెందిన వారే. అయితే పార్టీ నిర్ణయం అంటూ చైర్మన్‌గా ఉన్న రంగయ్యను ఓడించడానికి పార్టీపెద్దలు గ్రామ స్థాయిలో రాజకీయం చేశారు. కానీ రైతులు మాత్రం పార్టీ పెద్దల మాటలను బేఖాతరు చేసి రంగయ్యను తమ సొసైటీ చైర్మన్‌గా నాల్గవ సారి ఎన్నుకున్నారు. దీంతో గ్రామంలో బీఆర్ఎస్ రెండు వర్గాలుగా చీలిపోయింది. కాగా.. బస్వాపురం పాల సంఘం ఎన్నిక నిర్వహించాలని ఫిర్యాదు చేసిన అనంతరం ఆరుగురు డైరెక్టర్లు శ్రీశైలం క్యాంపునకు వెళ్లారు.

మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలి



ఓయూ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రామన్నపేట: రామన్నపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట, వలిగొండ మండలాలకు చెందిన ఓయూ విశ్వవిద్యాలయం విద్యార్థులు మంగళవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. రామన్నపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అనేక మండలాలకు చెందిన పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని, అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందని తెలిపారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో గోలి హరికృష్ణ, నకిరేకంటి రాజు, రావణ్, నరేందర్, నవీన్, రాధాకృష్ణ, గోపాల్, రాజు ఉన్నారు.

గ్రూప్- 4 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరిటౌన్: గ్రూప్- 4పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూలై 1న జరగనున్న గ్రూప్–4 పరీక్ష నిర్వహణకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, లైజనింగ్ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు 70 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని కోసం18 రూట్లను రూపొందించామని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 70 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 74 మంది లైజనింగ్ అధికారులు, 38 మంది రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. జిల్లాలో మొత్తం 19,800 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షకు ఉదయం 10.00 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.00 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు చెప్పులు ధరించి రావాలని, అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లకు కూడా సెల్‌ఫోన్లు అనుమతించవద్దని సూచించారు. ముందుగా తహసీల్దార్లు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి వసతులపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు భవనంలో కింద ఫ్లోర్‌లో ఉన్న గదులు కేటాయించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి భూపాల్ రెడ్డి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఉపేందర్ రెడ్డి, కలెక్టరేట్ విభాగం సూపరింటెండెంట్లు శ్రీనివాసరాజు, గిరిధర్, మానస తదితరులు పాల్గొన్నారు.

'పాలియేటివ్' కష్టాలు

- చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి పాలియేటివ్ భవనం కూల్చివేత
- సెంటర్‌ను ప్రభుత్వాస్పత్రిలోని బాలింతల వార్డులో ఏర్పాటుకు నిర్ణయం
- బాలింతల ఇబ్బందుల దృష్ట్యా వరండాలోనే బెడ్ల ఏర్పాటు
- అవస్థలు పడుతున్న సిబ్బంది, రోగులు

చౌటుప్పల్: దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి చరమాంకంలో పోరాడుతున్న వారికి సేవలందిస్తున్న చౌటుప్పల్‌లోని పాలియేటివ్ కేర్ యూనిట్ నిలువ నీడ కోల్పోయింది. 100 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం యూనిట్ భవనాన్ని కూల్చివేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలోని వరండాలోకి తరలించడంతో రోగులతో పాటు సేవలందించడానికి సిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఐదేళ్ల క్రితం పాత పీహెచ్‌సీ ప్రాంగణంలో ఏర్పాటు

ఐదేళ్ల క్రితం చౌటుప్పల్ పట్టణంలోని పాత పీహెచ్‌సీ ప్రాంగణంలో పాలియేటివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు వేలాది మంది బాధితులకు సేవలందిస్తూ వచ్చింది. ఇటీవల 100 పడకల ఆస్పత్రి మంజూరు కావడంతో జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయం (పాత పీహెచ్‌సీ) ప్రాంగణంలో నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం అదే ప్రాంగణంలో కొనసాగుతున్న పాలియేటివ్ కేర్ యూనిట్ పక్కా భవనాన్ని 15 రోజుల క్రితం కూల్చివేశారు. నాటి నుంచి రోగులకు, వైద్య సిబ్బందికి ఇబ్బందులు మొదలయ్యాయి. పాలియేటివ్ కేర్ యూనిట్‌ను తాత్కాలికంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యూనిట్‌కు బాలింతల వార్డులో సగభాగం కేటాయించి ప్రత్యేకంగా నలుగు బెడ్లు ఏర్పాటు చేశారు.

ఆవరణలో వైద్యసేవలు

బాలింతల వార్డులో సగభాగం కేటాయించినప్పటికీ ఆవరణలో రెండు బెడ్లు ఏర్పాటు చేసి పాలియేటివ్ కేర్ సేవలు అందిస్తున్నారు. వైద్యసిబ్బంది కూడా అదే వరండాలో టేబుల్ వేసుకొని కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. మెటర్నిటీ వార్డులో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు చికిత్స పొందే క్రమంలో బాలింతలు, చిన్నారులకు ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఉన్నందున వరండాలోనే సేవలందిస్తున్నారు.



ఆస్పత్రిలోని వరండాలో సేవలు పొందుతున్న బాధితులు

పక్కపక్కనే మూడు వార్డులు

పాలియేటివ్ కేర్ యూనిట్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినప్పటికీ అందుకు తగిన విధంగా సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ ఓ వైపు బాలింతల వార్డు, మరో వైపు డయాలసిస్ సెంటర్ ఉంది. తాజాగా పాలియేటివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేశారు. పక్కపక్క వార్డుల్లోనే మూడు రకాల సేవలు పొందుతున్న వ్యక్తులు ఇన్ఫెక్షన్లు సోకుతాయని ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యేక వార్డులు ఉండాలి



వైద్యసేవల కోసం మా అమ్మను తరచూ చౌటుప్పల్ ఆస్పత్రికి తీసుకువస్తున్నా. మెరుగైన సేవలు అందిస్తున్నారు. అయితే బాలింతలు, డయాలసిస్, పాలియేటివ్ కేర్ యూనిట్ పక్క పక్కనే ఉన్నాయి. అన్ని రకాలుగా వసతులున్న భవనాన్ని సమకూర్చి ప్రత్యేకంగా వార్డులు ఏర్పాటు చేయాలి.

– సాయిబాబా, నాగారం

గడువు మించితే అదనపు వడ్డింపు!

- ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్‌కు ఈ నెల 30లోపు 25 శాతం అపరాధ రుసుముతో మరోసారి అవకాశం
- వచ్చే నెల నుంచి 50 శాతం అపరాధ రుసుము
- ఆరు మున్సిపాలిటీల్లో 2,171 వాణిజ్య సముదాయాలకు లైసెన్సులు మంజూరు

భువనగిరిటౌన్: మున్సిపల్ శాఖ ఆదాయం పెంచుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నం చేస్తోంది. మే 30 తేదీ వరకు లైసెన్స్‌ల జారీ కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి ఎలాంటి అపరాధ రుసుము లేకుండా లైసెన్స్‌లు జారీ చేశారు. కానీ కొంతమంది మాత్రమే లైసెన్స్ తీసుకున్నారు. అదేవిధంగా గతంలో లైసెన్స్ తీసుకున్న వారందరూ రెన్యూవల్ చేసుకోలేదు. దీంతో మున్సిపల్ శాఖ ఈ నెల 30 వ తేదీలోపు 25 శాతం అపరాధ రుసుముతో మరోసారి అవకాశం కల్పించింది. తమ వ్యాపారాలకు సంబంధించి 2023- 24 ఆర్థిక సంవత్సరంలో ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోని వారు చేయించుకోవాలని మరోసారి ప్రకటన జారీ చేసింది.



భువనగిరి మున్సిపల్ కార్యాలయం

గతంలో మున్సిపల్ అధికారులు వచ్చి ఆన్‌లైన్ చేసేవారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ ద్వారా ధ్రువపత్రాలు జత చేసి ఫీజు చెల్లించి లైసెన్స్ తీసుకునే అవకాశం ఉంది. 2023- 24 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో 2,171 వాణిజ్య సముదాయాలకు లైసెన్సులు మంజూరు చేశారు. ఇందుకు ప్రభుత్వానికి రూ. 2 కోట్ల 33లక్షల ఆదాయం రానుంది.

జూలై నుంచి..

ట్రేడ్ లైసెన్స్ ఫీజును ఈ నెల 30 వరకు 25 శాతం అపరాధ రుసుము చెల్లించి రెన్యూవల్ చేసుకునేందుకు అవకాశం ఉంది. జూలై 1 నుంచి లైసెన్స్ ఫీజు నుంచి 50శాతం అపరాధ రుసుముతో లైసెన్స్ జారీ చేయడం జరుగుతుంది. ఎవరైనా చట్ట విరుద్ధంగా లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసుకున్నట్లు అయితే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం వ్యాపారం చేసుకోకుండా లైసెన్స్ రద్దు చేసి మరోసారి లైసెన్స్ జారీ చేయకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వెంటనే ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



మున్సిపాలిటీల్లో వాణిజ్య వ్యాపారం చేసుకునే వారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. గతంలో ఎన్నోసార్లు మున్సిపాలిటీ సిబ్బంది తిరిగి లైసెన్స్ ఫీజు వసూలు చేయడం జరిగింది. గతంలో వివిధ కారణాలు చెప్పి లైసెన్స్ ఫీజు చెల్లించని వారు ఈ నెల 30వ తేదీలోపు మీ ఫోన్ ద్వారా ధ్రువపత్రాలు జత చేసి ఫీజు చెల్లించి లైసెన్స్ తీసుకోవాలి. లేకుంటే వచ్చే నెల 1వ తేదీ నుంచి ఫీజుపై 50 శాతం వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుంది.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

ఇప్పటి వరకు జారీ చేసిన లైసెన్సుల వివరాలు

- భువనగిరి మున్సిపాలిటీలో 1,127 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 598 జారీ చేశారు. ఇందుకు రూ.26.12లక్షల ఆదాయం వచ్చింది. ఇంకా 529 జారీ చేయాల్సి ఉండగా మరో రూ.44.32 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.
- చౌటుప్పల్ మున్సిపాలిటీలో 600 లైసెన్స్‌లు లక్ష్యం పెట్టుకోగా ఇప్పటివరకు 105 జారీ చేశారు. వీటి ద్వారా రూ. 9.14లక్షల ఆదాయం వచ్చింది. మిగతా 495 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉంది.
- పోచంపల్లి మున్సిపాలిటీలో 462 లైసెన్స్‌లు జారీ చేయాలని టార్గెట్ ఉండగా 35 జారీ చేశారు. వీటి ద్వారా రూ.3.25లక్షల ఆదాయం వచ్చింది
- మోత్కూర్ మున్సిపాలిటీలో టార్గెట్ 320 జారీ చేయాల్సి ఉండగా 52 జారీ చేశారు. రూ.1.05లక్షల ఆదాయం వచ్చింది. మిగతా 268 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉండగా వీటి ద్వారా రూ.3.03లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.
- యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో 1,028 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉండగా 464 జారీ చేశారు. వీటి ద్వారా రూ.6.60లక్షల ఆదాయం వచ్చింది. మిగతా 536 జారీ చేయాల్సి ఉంది. వీటి ద్వారా రూ.4.55లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.
- ఆలేరు మున్సిపాలిటీలో 553 లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉండగా 185 జారీ చేశారు. వీటి ద్వారా రూ.4.20లక్షల ఆదాయం వచ్చింది. ఇంకా 362 జారీ చేయాల్సి ఉండగా.. వీటి ద్వారా మరో రూ.6.50లక్షలు ఆదాయం రానుంది.

అధునాతన హంగులతో.. ఆకట్టుకునేలా..

- టెంపుల్ సిటీపై రూ.3.55కోట్లతో వైటీడీఏ గెస్ట్‌హౌజ్ నిర్మాణం

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండకు అనుబంధంగా ఉన్న టెంపుల్ సిటీపై భక్తులను ఆకట్టుకునేలా వైటీడీఏ గెస్ట్‌హౌజ్ నిర్మాణం జరిగింది. 5వేల ఎస్ఎఫ్‌టీలో రూ.3.55కోట్లతో అధునాతన హంగులతో సంస్కృతి, సంప్రదాయాలతో ఆకట్టుకునేలా.. పల్లె వాతావరణాన్ని తలపించే ఈ వైటీడీఏ గెస్‌హౌజ్ నిర్మాణం ఉంది. గెస్ట్‌హౌజ్ చుట్టూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పెంకుటిళ్లులా నిర్మాణం చేశారు. ఇక లోపల భాగంలో వివిధ ఆకర్షణీయమైన డిజైన్లతో నిర్మించారు. ప్రస్తుతం ఇంటీరియల్ పనులు కొనసాగుతున్నాయి. కార్యాయాలనికి ముందు భాగంలో కోనసీమను తలపించేలా చెట్లు, గ్రీనరీ లాన్స్, పూల మొక్కలను ఏర్పాటు చేశారు.



ఆలయ నగరిపై నిర్మించిన వైటీడీఏ గెస్ట్‌హౌస్

కాంగ్రెస్‌లో అసమ్మతి రాగం

- కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పనితీరుపై అసహనం
- రిసార్ట్‌లో ఎంపీ అనుచరుల సమావేశం
- ఆలేరులోనూ ఇదే తరహా అసమ్మతి

సాక్షి,యాదాద్రి: భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అసమ్మతి గళం విప్పుతున్నారు. భువనగిరి మున్సిపాలిటీతోపాటు నాలుగు మండలాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్లు, ముఖ్య నాయకులు సోమవారం రాత్రి మేడ్చల్ మల్కాజిగిరి ఘట్కేసర్ శివారులోని ఎన్ఎఫ్‌సీ వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో రహస్య సమావేశం నిర్వహించినట్లు సమాచారం. డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన నాటినుంచి అనిల్‌కుమార్‌రెడ్డి తమను పట్టించుకోవడం లేదని సీనియర్ల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని, జిల్లాస్థాయి పూర్తి కమిటీని ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. కాగా వచ్చే ఎన్నికల్లో ఓసీతోపాటు బీసీ నాయకునికి కూడా ఎమ్మెల్యే టికెట్ గురించి పరిశీలించాలని వారు కోరినట్లు తెలిసింది. అసమ్మతి సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, సీనియర్‌నాయకులు రామాంజనేయులుగౌడ్, తుమ్మల యుగేందర్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నట్లు సమాచారం.

ఇటీవల బీర్ల అయిలయ్యపై సీనియర్ల నిరసన గళం

ఇటీవల ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న బీర్ల అయిలయ్యపై సీనియర్లు నిరసన గళమెత్తారు. ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తున్నారని నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నగేష్, నాయకులు బంద్రు శోభారాణి, కల్లూరి రామచంద్రారెడ్డి, వంచ వీరారెడ్డి, జనగాం ఉపేందర్‌రెడ్డి, బోళ్ల కొండల్‌రెడ్డి, సిరిగిరి సాగర్‌లు ఆలేరులో అసమ్మతి సమావేశం నిర్వహించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అసమ్మతి నాయకుల సమావేశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



ప్రమాణ స్వీకారం చేస్తున్న చిక్క వెంకటేశ్వర్లు, మిరియాల శ్రీనివాస్

భువనగిరిటౌన్ : పట్టణ కేంద్రంలో ఎస్ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చిక్క వెంకటేశ్వర్లు, పద్మశాలీ యువజన విభాగం అధ్యక్షుడిగా మిరియాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సుమారు 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు నుంచి అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని 72 మంది గల కార్యవర్గాన్ని పద్మశాలీ కుల పెద్దలు, ప్రజా ప్రతినిధుల మధ్య ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో వలందాస్ ఆదినారాయణ, బొద్దుల నగేష్, ఆడెపు శ్రీశైలం, గాడి పల్లి శ్రవణ్ కుమార్, గుండు ప్రసాద్, పోచం సోమయ్య చింతగింది శ్రీధర్, బడుగు సత్యనారాయణ, వెంకటేశం, జంగయ్య పురుషోత్తం, కందగట్ల భిక్షపతి, శ్రీరామ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమలగిరిలో ట్రాక్టర్ బీభత్సం


పూల బండ్లను ఢీకొట్టి నిలిచిన ట్రాక్టర్

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరిలో మంగళవారం సాయంత్రం ఓ ట్రాక్టర్ బీభత్సం సృష్టించింది. తిరుమలగిరి పాత గ్రామం నుంచి మొరం లోడ్‌తో ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా వస్తూ ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టాడు. ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ అదుపు తప్పి తొర్రూరు రోడ్డు వైపు ఉన్న పూల బండ్లను ఢీకొట్టి, పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ముందు ఆగి పోయింది. ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న ప్రవీణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలితే పెను ప్రమాదం కలిగేదని స్థానికులు చెప్పారు. రూ.20వేల నష్టం జరిగిందని పూలబండ్ల నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్

భూదాన్‌పోచంపల్లి : భూ తగాదాలో గొడ్డలితో దాడిచేసి గాయపర్చిన కేసులో నలుగురిని మంగళవారం రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. భూదాన్‌పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెంలోని 109, 110 సర్వే నంబర్‌లో గల గ్రామానికి చెందిన ఎర్రవోల వెంకటేశ్, ఏనుగు మాధవరెడ్డి మధ్య కొంతకాలంగా భూ వివాదం నెలకొంది.ఈ నెల 25న వివాదంలో ఉన్న పొలాన్ని ఎర్రవోల వెంకటేశ్ దున్నుతుండగా, విషయం తెలిసి మాధవరెడ్డి అక్కడికి వెళ్లి వారించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరగడంతో వెంకటేశ్, అతని భార్య నాగమణి, కుమారుడు లింగస్వామి, అల్లుడు శ్రీకాంత్ కలిసి మాధవరెడ్డి, అతని భార్య బాలమణి, కారుడ్రైవర్ వెంకటేశ్‌తో పాటు వీరి వెంట వచ్చిన పెద్ద మనిషి లింగయ్యపై కళ్లలో కారంపొడి చల్లి, గొడ్డలి, కర్రలతో దాడి చేసి గాయపర్చారు. అలాగే కారును రాళ్లతో ధ్వంసం చేశారు. ఈ ఘటనలో మాధవరెడ్డి తలకు, అతడి భార్యకు తలపై తీవ్ర గాయం కావడంతో పాటు చేయి విరిగింది. అలాగే వెంకటేశ్, లింగయ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొడ్డలితో దాడికి పాల్పడిన వెంకటేశ్, నాగమణి, లింగస్వామి, శ్రీకాంత్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కొండమల్లేపల్లి : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో గల వ్యవసాయ సబ్ మార్కెట్‌లో సోమవారం రాత్రి కొందరు పట్టణానికి చెందిన వ్యాపారులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని రూ.19,620 నగదు, ఐదు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మృత్యువుతో పోరాటం..!

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు
- మెదడులో గడ్డకట్టిన రక్తం
- ఆపరేషన్‌కు రూ.15లక్షలు కావాలంటున్న వైద్యులు
- సాయమందించాలని పేద కుటుంబం వేడుకోలు

కన్నీటి గాథ

రాజాపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు మృత్యువుతో పోరాటం చేస్తున్నాడు. మెదడులో గడ్డకట్టిన రక్తాన్ని కరిగించాలంటే ఆపరేషన్ తప్పనిసరి అని.. అందుకు రూ.లక్షలు ఖర్చవుతాయని వైద్యులు పేర్కొనడంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. రెక్కాడితే గాని పూట గడిచేది అంతంత మాత్రమే అని.. కుమారుడిని బతికించుకునేందుకు రూ.లక్షలు ఎక్కడి నుంచి తేచ్చేదని నిరుపేద దంపతులు కుమిలిపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన తమ్మునూరి ఆనంద్‌కు భార్య, కుమార్తె సంపూర్ణ, కుమారుడు సాయిరాం ఉన్నారు. కుమారుడికి ఏడాది క్రితం వివాహం కాగా కుమార్తె ఉన్నత విద్య అభ్యసిస్తోంది. ఆనంద్ కులవృత్తి (నాయీబ్రాహ్మణ) చేస్తుండగా ఇంటర్ వరకు చదివిన సాయిరాం తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిరామ్

అత్తారింటికి వెళ్తొస్తూ..

సాయిరాం భార్య పక్షం రోజుల క్రితం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 18న సాయిరాం బైక్‌పై అత్తారింటికి వెళ్లాడు. అదే రోజు రాజాపేటకు తిరిగి వస్తుండగా చేర్యాల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో సాయిరాం తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చేర్పించగా పరీక్షించిన వైద్యులు మెదడులో రక్త కట్టిందని తెలిపారు. ఆపరేషన్ తప్పనిసరి అని, అందుకు రూ.15లక్షలు అవసరం అవుతాయని చెప్పడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాతలు స్పందించి ఆపరేషన్ కోసం చేయూతనందించి తమ కుమారుడిని కాపాడాలని అర్థిస్తున్నారు.

ఆర్థికసాయం చేయాలనుకున్న వారు ఆనంద్ ఫోన్ పే, గూగుల్ పే నంబర్ 8499946253

కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి



“ కుటుంబానికి ఆసరగా ఉంటాడను కున్న కుమారుడు రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్నాడు. ఆపరేషన్ నిమిత్తం వైద్యులు రూ.15లక్షల వరకు ఖర్చు అవుతుందని అంటున్నారు. నిరుపేదలమైన మేము ఏమీ చేయలేని పరిస్థితి. దాతలు స్పందించి మా కుమారుడికి ప్రాణభిక్ష పెట్టండి. జీవితాంతం రుణపడి ఉంటాం.

–ఆనంద్, మణెమ్మ సాయిరామ్ తల్లిదండ్రులు, రాజాపేట

దేవరకొండలో వ్యక్తి హత్య

- కొట్టి చంపినట్లు హతుడి ఒంటిపై ఆనవాళ్లు
- ఆర్థిక లావాదేవీలా.. మరో కారణమా అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి


దేవరకొండ : ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్, పోలీసులు

దేవరకొండ : దేవరకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురయ్యాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణానికి చెందిన పులిజాల చంద్రమౌళి స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరిగా పని చేసేవాడు. ప్రస్తుతం చంద్రమౌళి వయో భారంతో ఇంటి వద్ద ఉంటున్నాడు. ఇప్పటికే దేవరకొండ పట్టణంలోని విష్ణు కాంప్లెక్స్‌లో సెంట్రల్ కిడ్స్‌వేర్ రెడిమేడ్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్న కుమారుడు పులిజాల రఘురాములు(36) తన తండ్రి చేసే దస్తావేజు లేఖరి పనిని కొనసాగిస్తున్నాడు. బట్టల షాప్‌ను రఘురాములు భార్య శ్రీలక్ష్మి చూసుకుంటోంది.

భార్యను ఇంటి వద్ద వదిలి వెళ్లి..

రాఘురాములు సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో కిడ్స్‌వేర్ దుకాణాన్ని మూసివేసిన తర్వాత భార్యను బైక్‌పై ఇంటివద్ద దింపాడు. అనంతరం బయట పనుందంటూ ఇంటి నుంచి బయల్దేరాడు. రాత్రి 10 గంటల నుంచి కుటుంబ సభ్యులు రఘురాములుకు ఫోన్ చేసినప్పటికీ అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సమీప బంధువులతో పాటు స్నేహితులను ఆరా తీసినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. మంగళవారం ఉదయం పట్టణ శివారులో శేరిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రఘురాములు విగతజీవిగా పడి ఉన్నాడు. మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన కొందరు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రఘురాములు ముఖంపై రక్తపు గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


రఘురాములు(ఫైల్)

ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

నల్లగొండ నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందం ఘటనాస్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. జాగిలాలు పట్టణ శివారులోని తుల్సమ్మ కుంట వరకు వెళ్లి ఆగిపోయాయి. ట్రైనీ ఐపీఎస్ శేషాద్రిని రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటికే సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు రఘురాములు ఫోన్ డేటాను పరిశీలిస్తున్నారు. రఘురాములును మరో ప్రాంతంలో హత్యచేసి శేరిపల్లికి వెళ్లేదారిలో పడవేసినట్లుగా అనుమానిస్తున్నారు. రఘురాములు తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డిండి సీఐ పరుశురాం తెలిపారు. హత్యకు ఆర్థిక లావాదేవీలా, మరో కారణమా అన్న దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో హోటల్ యజమాని మృతి

- ఒంటిపై దుస్తులు లేకుండా టిఫిన్ సెంటర్‌లోనే విగతజీవుడైన నిర్వాహకుడు
- మృతిపై అనుమానాలున్నాయంటూ పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు

చౌటుప్పల్ : అనుమానాస్పద స్థితిలో ఓ హోటల్ యజమాని మృతిచెందాడు. చౌటుప్పల్‌కు చెందిన ఆడెపు శ్రీను(50) పదిహేనేళ్లుగా పట్టణంలోని భాస్కర్ థియేటర్ ముందు టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. భార్యా, పిల్లలతో స్థానికంగా నివాసం ఉంటున్నాడు. రోజువారీ మాదిరిగానే శ్రీను సోమవారం సైతం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో టిఫిన్ సెంటర్ మూసివేసి భార్య చంద్రకళతో కలిసి ఇంటికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం 4–30గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటికి వచ్చాడు. రాత్రి 10గంటలు దాటినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య చంద్రకళ భర్త సెల్‌కు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. ఫలితం లేకపోవడంతో ఆమె అర్ధరాత్రి దాటాక 2గంటలకు పక్కింటి వ్యక్తిని వెంట పెట్టుకొని టిఫిన్ సెంటర్ వద్దకు వెళ్లింది. ముందు భాగంలో ఉన్న మెయిన్ షట్టర్ మూసి ఉండడంతో వెనుక వైపున ఉన్న డోర్ వద్దకు వెళ్లి చూశారు. గడియ పెట్టకుండా దగ్గరకు వేసి ఉన్న తలుపులను తీసి ఇద్దరు కలిసి లోనికి వెళ్లారు. అక్కడే గదిలో ఒంటిపై దుస్తులు కూడా లేని స్థితిలో శ్రీను నేలపై బోర్లా పడిపోయి ఉన్నాడు. దుస్తులు, సెల్‌ఫోన్ కౌంటర్‌పై ఉన్నాయి. లోపలికి వెళ్లిన ఆ ఇద్దరు కలిసి శ్రీను శరీర భాగాలను పరిశీలించారు. ఒంటిపై గాయాలు లేకపోవడంతో అంబులెన్స్‌ను పిలిపించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డ్యూటీ డాక్టర్ పరీక్షించి శ్రీను అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించాడు. సంవత్సరం కాలంగా తమ టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్న ఓ మహిళపై తమకు అనుమానం ఉందని చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.


ఆడెపు శ్రీను(ఫైల్)

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

హుజూర్‌నగర్: కడుపు నొప్పి భరించలేక ఓ వివాహిత శానిటైజర్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని సుందరయ్య కాలనీలో పిట్టల కళావతి తన భర్త నర్సింహారావు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కళావతి కొన్నిరోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో ఈనెల 21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శానిటైజర్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కళావతి సోమవారం సాయంత్రం చనిపోయింది. ఆమె భర్త పిట్టల నర్సింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆస్పత్రిలో అంబులెన్స్ డ్రైవర్ వీరంగం

- వైద్య సిబ్బందిపై దాడి.. ఫర్నిచర్ ధ్వంసం
- అడ్డొచ్చిన పోలీసుల విధులకు ఆటంకం
- నిందితుడి అరెస్ట్.. మిర్యాలగూడలో ఘటన

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం రాత్రి అంబులెన్స్ డ్రైవర్ వీరంగం సృష్టించాడు. రోగిని హైదరాబాద్‌కు తరలించేందుకు అద్దెకు తన అంబులెన్స్‌ను ఎందుకు పిలవలేదంటూ ఆస్పత్రి సిబ్బందిని దూషించి, దాడిచేయడంతో పాటు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు. మిర్యాలగూడ పట్టణం డాక్టర్స్ కాలనీలోని ఓ ఆస్పత్రిలో రోగిని అత్యవసర చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తమకు తెలిసిన ఓ అంబులెన్స్ డ్రైవర్‌ను మాట్లాడుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. కొద్ది సేపటి తరువాత పట్టణానికి చెందిన మరో అంబులెన్స్ నిర్వాహకుడు అక్బర్‌పాష ఆస్పత్రికి చేరుకుని రోగిని తరలించేందుకు తన అంబులెన్స్‌ను ఎందుకు పిలవలేదని వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ఆస్పత్రిలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు. అడ్డు వచ్చిన ఆస్పత్రి యాజమాన్యంపై తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడి చేశాడు. దీంతో డయల్ 100కు కాల్ చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న కానిస్టేబుళ్లు పగిళ్ల నాగరాజు, మాండవ సైదులు సదరు అక్బర్‌పాషను వారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్బర్‌పాష కానిస్టేబుల్ నాగరాజు గల్లా పట్టుకుని తీవ్ర పదజాలంతో దూషించి పక్కకు నెట్టి వేశాడు. ఆ దృశ్యాలన్నీ ఆస్పత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. విధులకు ఆటంకం కలిగించిన అక్బర్‌పాషను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


నిందితుడు అక్బర్‌పాష

గాయపడిన విద్యార్థిని మృతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామానికి చెందిన పూలమ్మ మల్లేశం దంపతుల కూతురు తేజశ్రీ(17), నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామానికి చెందిన సైదులు బైక్‌పై సోమవారం కొమురెల్లి మల్లన్న దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తేజశ్రీకి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను 108 ద్వారా గాంధీ ఆస్పతికి తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మంగళవారం మృతిచెందింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తేజశ్రీ (ఫైల్)

ఆ.. గురుకులంలో ఏం జరిగింది..?

- మిస్టరీగా విద్యార్థి ఆత్మహత్య
- మృతుడి స్వగ్రామం చౌటుప్పల్ మండలం జైకేసారంలో విషాదం

చౌటుప్పల్ : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన విద్యార్థి పందుల రంజిత్‌గౌడ్ (13) మంగళవారం ఆత్మహత్య అంతు చిక్కని మిస్టరీగా మారింది. చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన పందుల శ్రీధర్–ధనమ్మ దంపతులకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరు కూడా డిగ్రీ పూర్తి చేశారు. కుమారుడు రంజిత్ ప్రస్తుతం ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి దినసరి కూలి పనులకు వెళ్తోంది. ఇద్దరు కుమార్తెల తర్వాత రంజిత్ జన్మించడంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. ప్రయోజకుడిని చేయాలన్న లక్ష్యంతో గురుకులంలో చదివిస్తున్నారు. అయితే, 2022–23 విద్యాసంవత్సరం వరకు రంజిత్ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో 7వ తరగతి చదువుకున్నాడు. చూసి వచ్చేందుకు తమకు అనువుగా ఉంటుందన్న ఆలోచనతో తల్లిదండ్రులు ఇటీవలే కుమారుడిని అబ్దుల్లాపూర్ మెట్‌కు మార్పించుకున్నారు. ఆ క్రమంలో సోమవారం రోజు ఉదయం తల్లి ధనమ్మ కుమారుడిని ఇంటి నుంచి తీసుకెళ్లి స్వయంగా తానే గురుకులంలో చేర్పించి వచ్చింది.


రంజిత్ గౌడ్ (ఫైల్)


.ఒక్కరోజులోనే..

పాఠశాలలో చేర్పించి వచ్చినప్పుడు రంజిత్ సంతోషంగానే ఉన్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మరుసటి రోజే రంజిత్ ఎందుకు ఉరేసుకుని అఘాయిత్యానికి ఒడిగడతాడని, ఒక్క రోజులోనే పాఠశాలలో ఏం జరిగిందని తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు. గురుకులంలో చేర్పించి వచ్చి 24గంటలు గడవకముందే అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపించసాగారు. తాము వెళ్లేలోపే పాఠశాల నిర్వాహకులు కుమారుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. రంజిత్ మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుట్టలో భారీ వర్షం


యాదాద్రి ఆలయ గోపురాలను కమ్ముకున్న నల్లని మేఘాలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం సాయంత్రం సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. దట్టమైన నల్లని మేఘాలు కమ్ముకొని ఉరుములు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. యాదాద్రి కొండపై వర్షంతో భక్తులు తడిసిముద్దయ్యారు. దట్టంగా కమ్ముకున్న నల్లని మేఘాలతో కృష్ణ శిలపై అద్భుతం ఆకట్టుకుంది. ఇక వర్షం నీటితో భక్తులు ఆడుతూ కనిపించారు.


యాదాద్రి కొండపై వర్షం నీటిలో ఆడుతున్న చిన్నారులు

నేడు బెటాలియన్‌కు అడిషనల్ డీజీ రాక

నల్లగొండ క్రైం : నల్లగొండ మండలం అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌కు బెటాలియన్ అడిషనల్ డీజీ స్వాతి లక్రా బుధవారం రానున్నట్లు బెటాలియన్ కమాండెంట్ సాంభయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె పలు అభివృద్ధి పనుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

బాలుడిని హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురికి రిమాండ్

మునుగోడు: బాలుడిని హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురిని మునుగోడు పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సాయి, దాసరి శివకుమార్‌తో పాటు మరో మైనర్ అదే గ్రామానికి చెందిన శివను ఈ నెల 25న స్థానిక పాఠశాల వద్దకు పిలిపించారు. తమను గ్రామంలో హేళన చేస్తూ ఎందుకు మాట్లాడుతున్నావంటూ ముగ్గురు కలిసి శివపై ఒకరి తరువాత మరొకరు దాడి చేసి కొట్టారు.స్పృహ కోల్పోయిన శివని అదే పాఠశాలలోని మరుగుదొడ్ల గదిలో పడేసి వెళ్లిపోయారు. సాయంత్రం సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అటువైపు వెళ్లగా బాలుడి అరుపులు వినిపించడంతో వెంటనే డోర్ తీసి కుటుంబ సభ్యులకు సమచారం అందించాడు. కుటుంబ సభ్యులు శివని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శివ తల్లి సామువారం తన కుమారుడిని కొట్టిన ముగ్గురిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి నిందుతులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి

మర్రిగూడ : కుక్కల దాడిలో జింకపిల్ల మృతిచెందింది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని దామెరబీమనపల్లి గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ భూముల్లో సంచరిస్తున్న జింక పిల్లపై మంగళవారం వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గమనించిన స్థానిక రైతులు విషయాన్ని ఎంపీటీసీ సిలివేరు విష్ణుకు తెలిపారు. వెంటనే ఆయన అటవీశాఖ అధికారులతో పాటు పశువైద్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి గాయపడిన జింక పిల్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా చికిత్స పొందుతూ మృతిచెందింది.అటవీ శాఖ బీట్ ఆఫీసర్ నవీన్ పంచనామా నిర్వహించిన తర్వాత జింకపిల్ల కళేబరాన్ని ఖననం చేశారు.


జింక పిల్లకు చికిత్స చేయిస్తున్న బీట్ ఆఫీసర్, ఎంపీటీసీ

మిర్యాలగూడలో వ్యక్తి అదృశ్యం

మిర్యాలగూడ అర్బన్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. టూటౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం శాంతినగర్‌లో నివాసముంటున్న చిట్యాల వీరభద్రం స్థానిక రవీంద్రనగర్ కాలనీలోని ఓ ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19న ఉదయం వీరభద్రం షాపునకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 25ఏళ్ల జైలు

యాదగిరిగుట్ట రూరల్: లైంగికదాడి కేసులో నిందితుడిని 25ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ భువనగిరి జిల్లా అదనపు జడ్జి మంగళవారం తీర్పు వెల్లడించారు. యాదగిరిగుట్ట సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని ఓ ఆశ్రమానికి చెందిన బాలికపై 2019 సంవత్సరంలో మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన పన్నీరు కళ్యాణ్ అత్యాచారం చేశాడు. ఈ విషయమై యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి, జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా, బాధితురాలికి రూ.5లక్షల పరిహారం చెల్లించాలని భువనగిరి కోర్టు తీర్పు చెప్పినట్లు సీఐ వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఐఓ, ఏసీపీ నరసింహారెడ్డి, అడిషనల్ పీపీ, సత్యనారాయణ, సీడీఓ మహేష్, శ్రీనివాస్‌రెడ్డిలకు కోర్టు ప్రత్యేక అభినందనలు తెలిపిందని పేర్కొన్నారు.


నిందితుడు కళ్యాణ్

యువకుడికి గాయాలు

హుజూర్‌నగర్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. హుజూర్‌నగర్ మండలం లకారం గ్రామానికి చెందిన లతీఫ్ పట్టణంలో ఆటోలో వాటర్ సప్‌లై చేసేందుకు వచ్చాడు. స్థానిక శ్రీలక్ష్మీ థియేటర్‌కు వెళ్లే మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో అతడికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతడిని పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిని ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

చౌటుప్పల్‌లో విషాదం


చౌటుప్పల్‌లో ఇద్దరు పిల్లలను నీటిలో ముంచి తల్లి రాజేశ్వరి ఆత్మహత్య చేసుకోవడంతో ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు


రాజేశ్వరి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


చిన్నారులు అనిరుద్, హర్షవర్ధన్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తాత నర్సింహ


ఆస్పత్రిలో రోదిస్తున్న రాజేశ్వరి తల్లి రాములమ్మ


చిన్నారుల మృతదేహాలను పరిశీలిస్తున్న చౌటుప్పల్ సీఐ దేవేందర్